క్లుప్తంగా

తాగునీటి సమస్యకు పరిష్కారం



పైపులైన్ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోనిటౌన్: పట్టణంలోని ఆలూరు రోడ్డు ఏటీఆర్ కాలనీలో కొంతకాలంగా తాగునీటి సమస్య తలెత్తింది. కాలనీవాసులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల విన్నపం మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నీటి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం శుక్రవారం పైపులైన్ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. పైపులైన్ ఏర్పాటుతో ఇక కాలనీలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు

ఆదోనిటౌన్: పట్టణంలోని డీయస్పీ బంగ్లా రోడ్డులో జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, డీఈ, ఏఈలు పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత పాటించేలా చూడాలని ఏఈలు, డీఈలకు సూచించారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు కావడం వల్ల నిర్మాణ పనులు సకాలంలో పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

సాంకేతిక విద్య కోసమే ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న వీరభద్రగౌడ్

కౌతాళం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సాంకేతిక విద్య అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ట్యాబ్‌ల పంపిణీ చేస్తుందని వైఎస్సార్‌సీపీ బదినేహాల్ నాయకుడు వీరభద్రగౌడ్ పేర్కొన్నారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 8వ తరగతి విద్యార్థులు 131 మందికి ప్రధానోపాధ్యాయుడు హరినాథ్‌రావుతో కలిసి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్రెంటిస్ విధానం పునరుద్ధరించొద్దు

ఆదోని సెంట్రల్: అప్రెంటిస్ విధానం పునరుద్ధరించరాదని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ.సుంకన్న తెలిపారు. శుక్రవారం ఎస్టీయూ భవనంలో ఆదోని మండలాధ్యక్షుడు సి.రామకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. మంత్రివర్గ సమావేశంలో డీఎస్సీలో అప్రెంటిస్ విధానాన్ని తిరిగి తీసుకురావాలని నిర్ణయించడం సరికాదన్నారు. ఎస్టీయూ జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు బి.రామాంజినేయులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్ బాబు, గౌరవాధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, ఆర్థిక కమిటి అధ్యక్షుడు షేక్షావలి, నాయకులు రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

బోర్లకు మరమ్మతులు

కౌతాళం:మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో బోర్లకు మరమ్మతులు చేపట్టినట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో గ్రామంలో నీటి ఎద్దడి నివారణలో భాగంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు బోర్లకు మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. బీఎస్ఎన్ఎల్ ఏరియా, జెకెఎల్ఎస్ నగర్, ఉరుకుంద ఆర్చ్‌గేట్ వద్దనున్న బోర్లకు శుక్రవారం మరమ్మతులు చేయించారు.

వేతన జీవులను నిరాశపరిచిన బడ్జెట్

ఆదోని సెంట్రల్: కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులను నిరాశకు గురిచేసిందని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ జి.వీరచంద్రయాదవ్ శుక్రవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త పన్నుల విధానంలో ఇంటి అద్దె, విద్య, గృహ రుణాలపై వడ్డీ తదితర మినహాయింపులు వర్తింపజేయాలని మూడేళ్లుగా ఉద్యోగులు కోరుతున్నా పట్టించుకోక పోవడం దారుణమని వాపోయారు. ప్రత్యక్ష పన్ను మినహాయింపు పరిమితిని రూ.8 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రతిపాదనలకు సవరణలు చేసి పన్నుల భారం తగ్గించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కాస్తయినా ఉపశమనం కల్పించాలని కోరారు.

నాడు - నేడు ప్రగతి చూడు



నాడు - వాల్మీకినగర్‌లో వీధి రోడ్డు దుస్థితి



నేడు - కాలనీలో రూపుదిద్దుకున్న సీసీ రోడ్డు

- వాల్మీకి నగర్‌లో మౌలిక సౌకర్యాల కల్పన
- సంక్షేమ పథకాల ద్వారా రూ.27.07 కోట్లు లబ్ధి





కాలనీలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీ 1వ వార్డు వాల్మీకి నగర్‌లో సీసీ రోడ్లు అందంగా రూపుదిద్దుకున్నాయి. గత టీడీపీ 14 ఏళ్ల పాలనలో వార్డులో అభివృద్ధి ఏమీ జరగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక నాలుగున్నరేళ్ల పాలనలో ఆ వార్డులో అనేక అభివృద్ధి పనులు జరగడంతో పాటు సంక్షేమ పథకాల ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూరింది. కాలనీలో గత 30 ఏళ్లుగా సీసీ రోడ్డుకు నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గత డిసెంబర్‌లో ఎమ్మెల్యే కాలనీలో పర్యటించారు. ఆ సమయంలో స్థానికులు సీసీ రోడ్లు, మురుగు కాలువల సమస్యలను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల విన్నపం మేరకు రూ.20 లక్షలతో కాలనీలో సీసీ రోడ్డు, మురుగు కాలువ ఏర్పాటుకు డిసెంబర్‌లో భూమిపూజ చేశారు. వెనువెంటనే పనులు ప్రారంభించారు. నేడు కాలనీలో అభివృద్ధి పనులు పూర్తికావడంతో సీసీ రోడ్డు అందంగా రూపుదిద్దుకుంది. ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి. కాలనీ ఏర్పడిన నాటి నుంచి మహిళలకు సామూహిక మరుగుదొడ్లు లేక కొండకు సమీపంలో ఉన్న ముళ్లపొదల చాటుకు బహిర్భూమికి వెళ్లేవారు. అయితే జగనన్న పాలనలో మహిళలకు సామూహిక మరుగుదొడ్లు నిర్మించి వారి కష్టాలను తీర్చారు. ఇన్నేళ్లకు తమ కష్టాలు తీరిపోయాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కాలనీ వివరాలు

- 1వ వార్డు వాల్మీకి నగర్‌లో 4,380 మంది జనాభా ఉండగా అందులో 2380 మంది మహిళలు, పురుషులు 2000 మంది ఉన్నారు.
- వార్డులో వాల్మీకినగర్, ప్రశాంతినగర్, బారాకమాన్, మదీనాకాలనీ, కోటవీరభద్రస్వామి దేవాలయం ఏరియాలు ఉన్నాయి.
- వైఎస్సార్‌సీపీ పాలనలో 28 సంక్షేమ పథకాల ద్వారా ఆ వార్డులోని లబ్ధిదారులకు రూ.27.07 కోట్లు అందించారు.

రోడ్డు సమస్య పరిష్కరించారు



గతంలో కాలనీలో రోడ్డు లేక చాలా ఇబ్బందులు పడ్డాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఇంటింటికీ వచ్చి మా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు నిర్మించారు. జగనన్న పాలనలోనే కాలనీలో అభివృద్ధి జరిగింది.

– కోసిగి బోయ లక్ష్మి, వాల్మీకినగర్

గతంలో ముళ్లపొదలు, బురదలో నడిచేవాళ్లం



గతంలో కాలనీలో రోడ్డు లేక ముళ్లపొదలు, బురద మధ్య నడిచే వాళ్లం. వర్షాకాలంలో కొండపై నుంచి వచ్చే నీరు ఇళ్ల ముందు నిలిచి వీధిలో బురద, ఇంటి చుట్టూ ముళ్లపొదలు పెరిగేవి. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు సీసీ రోడ్డు నిర్మించడంతో మా కష్టాలన్నీ తొలగిపోయాయి. చాలా సంతోషంగా ఉంది.

– ఉరుకుందమ్మ, వాల్మీకినగర్

ప్రజలు మెచ్చిన ఏకైక ప్రభుత్వం



వృద్ధుడికి అందిన పథకాలను వివరిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు/మంత్రాలయం: రాష్ట్ర చరిత్రలోనే ప్రజలు మెచ్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్దకడబూరు సచివాలయం- 2 పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి మంజూరైన పథకాల అమలు తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూ లేనట్లుగా ఎన్నికల హామీలను 98 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా జగనన్న దేశచరిత్రలో కొత్త అధ్యాయం లిఖించారన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దకడబూరు, దొడ్డిమేకల సర్పంచ్‌లు రామాంజనేయులు, చంద్రశేఖర్, జేసీఎస్ కన్వీనర్ రవిచంద్రరెడ్డి, కోసిగి మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న, మాజీ ఎంపీపీ రఘురాముడు, ఎంపీడీఓ ప్రభాకర్, ఈఓపీఆర్డీ జనార్దన్‌రెడ్డి, ఆర్‌ఐ మహేష్, నాయకులు శివరామిరెడ్డి, గజేంద్రరెడ్డి, బొగ్గుల తిక్కన్న, పూజారి ఈరన్న పాల్గొన్నారు.

రెండోరోజూ పింఛన్ల పంపిణీ



అమరావతినగర్‌లో హరిజన చౌడమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఎస్ఎండీ షరీఫ్



దిబ్బనకల్‌లో మంచం పట్టిన నామాల అంజినమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ మీనాక్షి

ఆదోనిటౌన్: ఆదోని నియోజకవర్గంలో రెండోరోజూ శుక్రవారం వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కొనసాగింది. పట్టణంలోని అమరావతి నగర్‌లో మంచం పట్టిన వృద్ధురాలు హరిజన చౌడమ్మకు వలంటీర్ ఎస్ఎండీ షరీఫ్ పింఛన్ నగదు రూ.3 వేలు అందజేశారు. రూరల్‌లో దిబ్బనకల్ గ్రామానికి చెందిన మంచం పట్టిన నామాల అంజినమ్మకు వలంటీర్ మీనాక్షి పింఛన్ అందజేశారు. పింఛన్ల సొమ్ము రూ.3 వేలు అందుకున్న లబ్ధిదారులు వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో పింఛన్ పొందాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లమని, నేడు ఇంటి వద్దకే పింఛన్ మొత్తాన్ని అందిస్తున్నారని లబ్ధిదారులు పేర్కొన్నారు.

జిల్లాస్థాయి ఖోఖో విజేత వందగల్లు



గెలుపొందిన జట్టుతో కోచ్ ధర్మరాజు

కోసిగి: ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో మండలంలోని వందగల్లు సచివాలయం జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో ఖోఖో ఫైనల్ పోటీ నిర్వహించారు. జనవరి 31 నుంచి జిల్లా స్థాయి పోటీలు జరుగుతున్నాయి. వందగల్లు, తుగ్గలి జట్ల మధ్య హోరా హోరీగా జరిగిన పోరులో వందగల్లు గెలుపొందింది. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి క్రీడకారులు, కోచ్ ధర్మరాజును అభినందించారు. ఈనెల 5న జట్టుకు జిల్లా కలెక్టర్ ప్రశంస పత్రాలు, మెడల్స్, రూ.60వేల నగదు బహుమతి అందజేయనున్నారు. అలాగే గెలుపొందిన క్రీడకారులు ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన కలశం రవి, తీవ్ర గాయాలతో వీరేష్

కోసిగి: మండలంలో వేర్వేరు చోట్ల బైక్‌లు అదుపు తప్పి కిందపడిన ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. స్థానిక కడపాళెం వీధికి చెందిన కలశం రవి (32) గురువారం రాత్రి బైక్ పై భార్య ఊరు కౌతాళం మండలం చూడి గ్రామానికి బయలుదేరాడు. తిప్పలదొడ్డి గ్రామ సమీపంలో బైక్ అదపు తప్పి ఎల్లెల్సీ కాల్వలోకి పడి స్పృహ తప్పాడు. రాత్రి ఎవరు గమనించలేదు. శుక్రవారం ఉదయం అటుగా వెళ్తున్న ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. కౌతాళం పోలీసులు వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని గుర్తించారు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లింగమ్మ, కుమారుడు ఉన్నాడు. అలాగే నాడుగేని వీధికి చెందిన వీరేష్ గురువారం రాత్రి 12 గంటల సమయంలో దుద్ది రిజర్వాయర్ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. చిర్తనకల్లు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు 108కు సమాచారమివ్వగా అంబులెన్స్‌లో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉందని కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఆదోని మండలం పెద్ద తుంబళం గ్రామానికి చెందిన రామకృష్ణ చిర్తనకల్లు దేవరకు వెళ్లి బైక్ పై తిరిగి వస్తుండగా దుద్ది రిజర్వాయర్ సమీపంలో బైక్ అదుపు తప్పి పడిపోయాయి. 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు చిన్నా, చలపతి తదితరులు

ఆదోనిరూరల్: పట్టణంలోని 18, 19, 20వ వార్డులకు సంబంధించి మనోజ్‌రెడ్డి నేతృత్వంలో ఈ నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు కౌన్సిలర్లు చిన్నా, చలపతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం క్రికెట్ పోటీలను వారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.10,116, రెండో బహుమతి రూ.5,116లను స్పాన్సర్స్ కంబిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి అందజేస్తారన్నారు. ఆర్గనైజర్‌లు రాజశేఖర్, మోహన్‌రాజేష్‌లతో పాటు కల్లుపోతుల సురేష్ పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి ఆమోదం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని మసూదియ అరబిక్ పాఠశాలలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని కరెస్పాండెంట్ మహమ్మద్ సలావుద్దీన్ తెలిపారు. ఆయన శుక్రవారం ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం పాఠశాలలో ఉద్యోగాల భర్తీకి కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. నియాజ్ అమ్మద్, ఎండీ సలావుద్దీన్, ముల్లా అబ్దుల్ షుకూర్, ఎండీ ఫెరోజ్, ఎండి సిరాజ్‌అహ్మద్ తదితరులు ఉన్నారు.

శివస్వాములకు అన్నదానం



పూజలు చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలో శివస్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు మాజీ ఎంపీటీసీ చౌదరిబసవ ఏర్పాటు చేశారు. అంతకు ముందు శివుడికి ప్రత్యేక పూజలు చేపట్టగా శివ మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భిక్ష ఏర్పాటు చేశారు. సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, మాజీ సర్పంచ్ అవతారం ,మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి పాల్గొన్నారు.

మద్యం తరలిస్తుండగా..

ఆదోనిరూరల్: అక్రమంగా ఆంధ్ర మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి శుక్రవారం తెలిపారు. మండలంలోని నాగలాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు, ఈడిగ పెద్దవీరేష్ బైకుపై ఆంధ్రా మద్యాన్ని (40 బాటిళ్లు) తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని, మద్యం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఆంధ్ర మద్యాన్ని పరిమితికి మించి కొనుగోలు చేయడం, తరలించడం చట్టరీత్యా నేరమని, వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వాహకులు రూపామోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు గోపాలదాసుల ఆరాధనోత్సవాలు





విజయదాసులు గోపాలదాసునికి అంకితమిస్తున్న విగ్రహం,గోపాలవిఠల దాసుల మఠం

ఆదోనిఅర్బన్: ముక్తి పొందాలంటే మునులు తపస్సులు, యజ్ఞాలు, జపాలు చేసేవారు. దేవుడి కీర్తనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, ధర్మ ప్రచారం చేశారు. ఎన్నో త్యాగాలు చేసి ముక్తి పొందారు. ఇలాంటి వారిలో ఒక దాస సాహిత్యుడు గ్రంథాన్ని రాస్తూ మధ్యలో శ్వాస విడిచారు. ఆ గ్రంథాన్ని ముగించేందుకు దాస సాహిత్యుడిని బతికించి ఆయుష్షు పోశారు గోపాల విఠలదాసుడు.

గోపాలవిఠలదాసు వారి అసలు పేరు బాగన్న. తెలంగాణ రాష్ట్రం దేవదుర్గ ముసరకల్లు గ్రామానికి చెందిన మురారీ వెంకమ్మ కుమారుడు బాగన్న. వీరి కుటుంబం కడు పేదరికం. ముసరకల్లు నుంచి గద్వాల్ సమీపంలోని సంకాపురం వెళ్లి ఆంజనేయ స్వామి ఆలయంలో జీవనం సాగిస్తుంటారు. అక్కడున్న బాగన్నకు ఓ పూజారి ధర్మోపదేశం చేస్తారు. ఆ ఆలయంలోనే 24 లక్షల మంత్రాన్ని బాగన్న జపించి మహాయోగి అవుతాడు. ఎవరికైనా మూడు జన్మల ముందు, తర్వాతి విశయాలు (జాతకం) చెప్పే శక్తి వస్తుంది. ఎంత యోగి అయినా ఆయనకు ఒక గురువు కావాల్సి ఉంది. గురువు కోసం వెతుక్కుంటూ ఆదోనికి వస్తాడు. మంగరాయ అంజనేయస్వామి ఆలయానికి చేరుకోగా బాగన్నకు అనుగ్రహం ఇచ్చేందుకు విజయదాసుల వారు అక్కడికి వస్తారు. బాగన్న మహిమలను చూసి 1746 నవంబర్ 14వ తేదీన శుద్ధ త్రయోదశి శుక్రవారం రోజు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి గోపాలవిఠలదాసు పేరుతో అంకితమిస్తారు. అప్పటి నుంచి బాగన్న పేరుపోయి గోపాలవిఠలదాసుగా వాసికెక్కారు. భక్తి కీర్తనలు, వేదాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, పురాణాలు, భవిష్యవాణి, గత జన్మల విషయాలు చెబుతూ అందరినీ ఆశ్చర్యపరుస్తారు.

చరిత్ర

గోపాల విఠలదాసుల శిష్యుడు జగన్నాథదాసులకు ఆయుష్షు తక్కువగా ఉంటుంది. శిష్యుడు హరికథంబ్రుసార అనే గ్రంథాన్ని రచిస్తుంటారు. గ్రంథం పూర్తిగాకముందే ఆయన మరణిస్తారు. విషయం తెలుసుకున్న గురువు గ్రంథం పూర్తిగాకపోతే ధర్మ ప్రచారం ఆగిపోతుందని గ్రహిస్తాడు. శిష్యుడికి తన ఆయుష్షు 40 సంవత్సరాలు దారబోసి ఆయన్ను బతికిస్తారు. శిష్యుడికి ఆయుష్షు దారబోయడంతో గోపాలదాసులవారు ముక్తి పొందుతారు. తెలంగాణ రాష్ట్రం ఐజ వద్ద ముత్తునూరు గ్రామంలో తుదిశ్వాస వదలడంతో అక్కడ ఆయనకు ఆశ్రమం ఉంది.

నేడు ఆరాధనోత్సవాలు

పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం గోపాలవిఠల దాసుల వారి ఆరాధనోత్సవం ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో జరగనుంది. మంత్రాలయం మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు ఆంజనేయ స్వామికి, గోపాలవిఠలదాసుల వారికి ప్రత్యేక పూజలు, హోమాలు, పల్లకీసేవ, రథోత్సవం, అన్నదానం నిర్వహిస్తారు.

దాన ధర్మాలు చేశారు



జ్యోతిష్యం, వేదాలు, కవిత్వాలు, పురాణాలు, ఆధ్యాత్మిక కీర్తనలు చెప్పుకుంటున్న గోపాలవిఠల దాసులకు భాగభోగ్యాలు, ధనధాన్యాలు అన్ని ఆయనకు వద్దకు వచ్చాయి. అయితే దానిని తన వద్ద పెట్టుకోకుండా పేదవాళ్లకు ధానధర్మాలు చేసి అందరినీ ధనవంతులుగా చేస్తారు. ఎంతోమంది దాససాహిత్యులు దేశ సంచారం కోసం వచ్చి ఆదోని లోని మంగరాయ సన్నిధిలో స్వామివారి దర్శనం చేసుకుని పూజించారని పురాణాలు చెబుతున్నాయి.

– సుస్వరం నాగరాజ ఆచార్యులు, సరస్వతరత్న విద్వాన్ పండితుడు

వైఎస్సార్ బీమా నిరుపేదలకు వరం



నామినీ ఈడిగ లక్ష్మికి బీమా నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: బాధితా కుటుంబాలకు వైఎస్సార్ బీమా అండగా ఉంటుందని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆరేకల్ గ్రామానికి చెందిన ఈడిగ నరసింహులు గత నవంబర్‌లో గుండెపోటుతో మృతిచెందారు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరు కాగా శుక్రవారం నగదును నామినీ ఈడిగ లక్ష్మికి అందజేశారు. వారి కుటుంబ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీలో ఇంటి స్థలం, వైఎస్సార్ పెన్షన్ కానుక అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆరేకల్ సర్పంచ్ లోహిత వీరస్వామి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు బళ్లారి రాముడు, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ విస్తృత తనిఖీలు



ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులకు సూచనలు చేస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని శుక్రవారం సాయంత్రం ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రతి వార్డును పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆరోగ్యమిత్ర సిబ్బంది అందుబాటులో లేకపోవడతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి మెమో జారీ చేయాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలింగ్ నాటికి కేంద్రాల వద్ద పరిస్థితిపై పర్యవేక్షణ అవసరమని సబ్‌కలెక్టర్ సూచించారు. మండలంలోని పెద్దతుంబళం గ్రామంలోని 1, 2, 3, 4, 5, 6, 7 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ వెంకటలక్ష్మికి సూచించారు.

స్థలాల పరిశీలన

ఆదోని మండలంలోని కుప్పగల్ గ్రామ సమీపంలో రైల్వే గేట్ వద్ద స్థలాన్ని, కోసిగి మండలం ఐరనగల్లు రైల్వే గేట్ సమీపంలోని స్థలాన్ని రైల్వే డిప్యూటీ ఇంజినీర్ రమణరావుతో కలిసి సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం కోసం స్థల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని, అలాగే అభివృద్ధి పనులకు భూసేకరణ వేగవంతం చేయాలని తహసీల్దార్లు వెంకటలక్ష్మి, రామేశ్వరగౌడ్, రుద్రగౌడ్‌లను ఆదేశించారు.

రసాయనాల వినియోగం అరికట్టాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఆదోనిరూరల్: వ్యాపారులు పండ్లను మాగబెట్టేందుకు రసాయనాలు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు వీరేష్, మండల కార్యదర్శి కల్లుబావి రాజు, సభ్యులు విజయ్, కొత్తూరు ఈరన్న కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆదోని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఆదోని పట్టణంలో దాదాపు 20 మంది పండ్ల వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి టన్నులకొద్దీ అరటి, సపోటా తదితర పండ్లను తీసుకొచ్చి రసాయనాలు చల్లి మాగబెడుతున్నారన్నారు. వాటిని ఉదయం వీధి వ్యాపారులకు హోల్‌సేల్ ధరలకు అమ్ముతున్నారన్నారు. పట్టణ ప్రజలు ఆ పండ్లను తిని అనారోగ్యం బారిన పడుతున్నారని వివరించారు. వెంటనే చర్యలు చేపట్టి పండ్ల వ్యాపారులు రసాయనాలు వినియోగించకుండా అడ్డుకోవాలన్నారు. ఏఐవైఎఫ్ అధ్యక్షుడు రమేష్, నాయకులు పుష్పరాజు, పరశురామ్ తదితరులు ఉన్నారు.

నివాళి

పెద్దకడబూరు:మండలంలోని చిన్నతుంబళం గ్రామ సింగిల్‌విండో అధ్యక్షుడు మనేగారి రవీంద్ర భార్య వినీల (45) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అలాగే..మండల కేంద్రానికి చెందిన పూజారి నరసింహులు కుమారుడు పూజారి రవి (25) గురువారం గుండెపోటుతో మృతి చెందగా వై.ప్రదీప్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించి సొంతంగా రూ.10వేల ఆర్థిక సాయంతో పాటు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు ఉన్నారు.

చిరుత దాడిలో మేక మృతి



మృతి చెందిన మేక

కోసిగి: స్థానిక రంగప్ప గట్టు సమీపంలోని తమ్మనగేని కృష్ణకు చెందిన గొర్రెల మందపై గురువారం రాత్రి చిరుత దాడి చేసింది. అందులో నుంచి ఒక మేకను పట్టుకుని పరుగులు తీస్తుండగా అక్కడున్న కుక్కలు అరవడంతో గొర్రెల కాపరులు కేకలు వేయడంతో మేకను వదిలేసి చిరుత పరారైంది. అయితే అప్పటికే మేక చనిపోయింది. గత ఐదు రోజుల నుంచి మూడు మేకలు పట్టుకెళ్లిందని వారు పేర్కొన్నారు. విషయాన్ని ఫారెస్ట్ అధికారుల కు తెలియజేయడం తోపశువైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో మృతి చెందిన మేకకు పోస్టుమార్టం చేశారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా నష్ట పరిహారం అందేలా చూస్తామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనురాధ తెలిపారు.